ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 230 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 30 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## రాత్రి వరకు కొనసాగిన
# నామినేషన్ల పర్వం

### చివరి రోజు సర్పంచి స్థానాలకు 20 వేలు, వార్డు సభ్యులకు 50 వేలకు పైగా దాఖలు

### తొలి దశ పంచాయతీ ఎన్నికలు 11న... అదే రోజు ఫలితాలు

హైదరాబాద్, నవంబర్ 29 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు తొలిదశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పర్వం చివరి రోజైన శనివారం రాత్రి వరకు కొనసాగింది. వాస్తవానికి నామినేషన్ల దాఖలుకు సాయంత్రం ఐదు గంటల వరకే గడువు ఉంది. అయితే, పలు జిల్లాల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు సాయంత్రం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో 5 గంటల వరకు వచ్చిన వారందరి నుంచీ స్వీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి బాగా రాత్రయింది. సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు పార్టీల మద్దతుదారులు భారీ సంఖ్యలో దాఖలు చేశారు. చివరి రోజు సమర్పించిన నామినేషన్లకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి అర్ధరాత్రి వరకు కూడా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పూర్తి సమాచారం అందలేదు. శనివారం ఒక్కరోజే సర్పంచి స్థానాలకు 20 వేలకు పైగా, వార్డు సభ్యుల స్థానాలకు 50 వేలకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. అధికారికంగా ఆదివారం వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. దాఖలైన నామినేషన్లను అధికారులు ఆదివారం పరిశీలిస్తారు. సాంకేతికంగా




చెల్లుబాటయ్యే నామినేషన్ల వివరాలను ఆదివారమే ప్రకటిస్తారు. వాటిపై అప్పీళ్లను డిసెంబరు 1వ తేదీన స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 3వ తేదీ తుది గడువు. పోటీలో మిగిలిన అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను అదేరోజు వెల్లడిస్తారు. గ్రామపంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. తొలి దశ పోలింగ్ డిసెంబరు 11న నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

**రెండో విడతకు...**

డిసెంబరు 14న జరిగే రెండో విడత ఎన్నికలకు ఆదివారం నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 గ్రామపంచాయతీలు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మూడో విడత ఎన్నికలు డిసెంబరు 17న నిర్వహిస్తారు.

## పారిశ్రామిక వేత్తలకు 'పవర్ ఫుల్' ధమ్కీ



### "ఇల్లీగల్" వసూళ్ళ కోసం "లీగల్" బెదిరింపులు

### మొదట" బేరం" కుదరకపోతే" రాయబారం"

### మామూళ్లు ఇవ్వాల్సిందే..ఓ పార్టీ నేత హుకుం

పటాన్ చెరు, నవంబర్ 29(ప్రభాత ఉదయం): మీకు ఫలానా అనుమతి లేదు.. మీకు మరో అనుమతి లేదు.. సరే ఇవన్నీ లేకున్నా ఏమీ కాదు కానీ నా మద్దతు మీకు ఖచ్చితంగా ఉండాలి.. మాతో ఏదోఒకటి మాట్లాడుకుని బేరం కుదుర్చుకుని పరిష్కారం చేసుకోండి...లేకపోతే మీకు లీగల్ నోటీసులు ఇప్పిస్తా... అధికారులతో ఒత్తిడి పెట్టిస్తా...ఇది బెదిరింపులకు రెండో మార్గం... ఇదీ కుదరకపోతే తన మనుషులతో పారిశ్రామిక వేత్తలకు రాయబారం పంపిస్తారు.. ఇలా ఎన్నో రకాలుగా ఐడిఎ బొల్లారం పారిశ్రామిక వేత్తలకు ఇటీవల బెదిరింపులు ఎక్కువ అయ్యాయని పారిశ్రామిక వాడలో చర్చ నడుస్తోంది .మీకు దానికి సంబంధించిన అనుమతులు లేదు, దీనికి సంబంధించిన అనుమతులు లేవు కానీ నా మద్దతు మాత్రం మీకు తప్పకుండా కావాలి లేదంటే మీకు ఇబ్బందులు తప్పవు అనే ఉద్దేశంతో అతని చేస్తున్న రచ్చ తో పారిశ్రామిక వేత్తలు తలలు పట్టుకుంటున్నారు. ఐడిఎ బొల్లారంలో కెమికల్, ఫార్మా, ఇనుము, ఇంజనీరింగ్ పరిశ్రమలు సుమారు రెండు వందల వరకూ ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో అనేక వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ ఉంటారు. అంతేకాకుండా పరిశ్రమల పరిధి పెంచుకునేందుకు పలు నిర్మాణాలు చేపడుతుంటారు. ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్న తరుణంలో సదరు నాయకుడు తనదైనశైలిలో బెదిరింపులకు దిగుతునట్లు పారిశ్రామిక వాడలో చర్చ నడుస్తోంది. అవసరమైతే లీగల్ నోటీసులు ఇప్పిస్తా అంటూ ఇల్లీగల్ వసూళ్ల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నట్లు నమ్మదగిన సమాచారం. వ్యాపార భాగస్వామ్యం కావాలి, లేదా తన పార్టీ అభివృద్ధికి, పార్టీ మనుగడ కోసం ఖర్చులు కావాలని పలువురు పారిశ్రామికవేత్తలతో బేరసారాలు చేస్తున్నట్లు వినికిడి. పార్టీ పేరు చెప్పి తన స్వప్రయోజనాల కోసం బలవంతపు వసూళ్ల కోసం ఎగబడుతున్న ఆ నాయకుడి తీరు పట్ల, అతడు అవలంబిస్తున్న వైఖరి పట్ల ఇప్పటికే ఆ పార్టీ శ్రేణుల్లో అంతర్గత చర్చలు నడుస్తూ ఉన్నాయి. ఈ విషయం గురించి ఎంతోకొంత తెలిసికూడా సదరు పార్టీ ముఖ్య నాయకులు సైతం చర్యలు చేపట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఈ విషయం గురించి ఇప్పటికే కొందరు పారిశ్రామిక వేత్తలు తమ ఇబ్బందుల గురించి, అతని వేధింపుల గురించి హైదరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకెళ్ళి నట్లుగా సమాచారం. ఈ తతంగానికి ఎలాంటి ముగింపు దొరుకుతుందో ఎదురు చూడాల్సిందే.

# కేసీఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు



### కెసిఆర్ ఎప్పుడు రావాలో అప్పడే వస్తారు

### కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు

### కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్, నవంబర్ 29 (ప్రభాత ఉదయం) కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లాడుతున్నారని.. అడ్డమైన మాటలు కొందరు మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామి సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు. సోనియా గాంధీని బలిదేవత అన్నది ఇప్పుడున్న ముఖ్యమంత్రి అని గుర్తుచేశారు.

## 3 ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యంలో
# విద్యుత్ ఉత్పత్తే కీలకం



### భట్టి విక్రమార్క

### భవిష్యత్ అవసరాల కోసం సన్నద్ధతపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజంటేషన్

### 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 29 (ప్రభాత ఉదయం)

విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, భవిష్యత్ అవసరాల కోసం సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. స్పష్టమైన అవగాహనతో విద్యుత్ రంగంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నామని అన్నారు. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరాలని తీర్చిదిద్దుతున్నామని హామీ ఇచ్చారు. సీఎం, కేబినెట్ సహచరులు కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరడానికి పెట్టుబడులు రావాలని, రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని వెల్లడించారు. ఉత్పత్తి రంగాలు అభివృద్ధి చెందితేనే ఆశించిన స్థాయిలో ఎకానమీ ఉంటుందని, పదేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని వివరించారు.

ఏటా 10 శాతం పవర్ గ్రోత్ : 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని భట్టి విక్రమార్క

..మిగతా 2లో



## గ్లోబల్ సమ్మిట్ పేరుతో
# రియల్ వ్యాపారం

### భూములు అమ్ముకునే కుట్ర

### సిఎం రేవంత్‌పై

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

సిద్దిపేట, నవంబర్ 29 (ప్రభాత ఉదయం) గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ సన్నిహితుడే
# గ్రామ సర్పంచిగా ఏకగ్రీవం!



నాగర్‌కర్నూల్: నవంబర్ 29 (ప్రభాత ఉదయం)సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో సర్పంచి పదవి ఏకగ్రీవమైంది. గ్రామస్థులంతా మల్లెపాకుల వెంకటయ్యను సర్పంచిగా ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి ట్వీట్ చేశారు. "ఎటువంటి పోటీ లేదు. శత్రుత్వం లేదు. మా ప్రజలంతా నమ్మకంతో ఐకమత్యంగా ఏకతాటిపైకి వచ్చారు. ఇది మా గ్రామ ఐక్యతా స్ఫూర్తిని చాటుతోంది" అని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి శనివారం నాటికి మొదటి దశ నామినేషన్ల గడువు ముగిసిన విషయం తెలిసిందే.

**సీఎం ప్రోత్సాహంతోనే ..**

సీఎం రేవంత్ రెడ్డి కటుంబానికి వెంకటయ్య అత్యంత సన్నిహితంగా ఉండేవారు. సర్పంచి ఎస్సీ రిజర్వుడ్ కావడంతో హెూంగార్డు ఉన్న ఆయన రాజీనామా చేసి నామినేషన్ వేశారు. సీఎం ప్రోత్సాహంతో గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చి మల్లెపాకుల వెంకటయ్యను ఏకగీవ్రంగా ఎంపిక చేసి గ్రామస్థులతో ర్యాలీగా వెళ్లి ఒక్కరితోనే నామినేషన్ వేయించారు. గ్రామంలో 10 వార్డులు ఉ ండగా అభ్యర్థులు ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తన వంతు సహకరించి రాష్ట్రంలోనే కొండారెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి అడుగుజాడల్లో నడిచినందుకే తనకు ఈ పదవి దక్కిందని చెప్పారు. వారితో పాటు గ్రామస్థులకు ఎంతో రుణపడి ఉంటానని వెల్లడించారు.

# నేటి నుండి రెండవ విడత నామినేషన్ ప్రక్రియ

**జనగాం, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల్లో నామినేషన్ స్వీకరణ కి ఏర్పాట్లు పూర్తి**

**ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం): సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే రెండవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుండి డిసెంబర్ 2 వ తేదీ వరకు.. జనగాం, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాలకు సంబంధించిన 79 గ్రామపంచాయతీలు, 710 వార్డులకు జరిగే రెండవ విడత నామినేషన్ ప్రక్రియ కి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం గా ఉన్నారన్నారు.నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ, ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని.. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.

# దక్షిణ భారత విద్యా పర్యటనలలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల డిగ్రీ విద్యార్థులు

**తమిళనాడు, కేరళ, కర్ణాటక వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో పాటు పలు జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థల సందర్శన**





కేరళ లోని వ్యవసాయ పరిశోధన స్థానాలు, మ్యూజియం లను సందర్శించిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

బుద్వేల్, నవంబరు 29(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ మూడవ ఏడాది విద్యార్థులు దక్షిణ భారత విద్యాయాత్రను ఈనెల 21 నుంచి ప్రారంభించారు. కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ ఈ యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా కర్ణాటక లోని బెంగుళూరు యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ మరియు జాతీయ ఉద్యాన పరిశోధనా సంస్థని, మైసూర్ లోని జాతీయ ఆహార శాస్త్రం మరియు పరిశోధనా సంస్థని సందర్శించి వివిధ నూతన పద్ధతుల గురించి తెలుసుకున్నారు. ఊటీ లో ఉన్న జాతీయ బంగాళాదుంప పరిశోధన సంస్థను సందర్శించి అక్కడి శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ పటేల్ ద్వారా నూతన వంగడాల గురించి తెలుసుకున్నారు. పోటీలోని దొడ్డబెట్టు పర్వతాలు, ఊటీ లేకును సందర్శించి జీవవైవిధ్యంలో వాటి ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. ఈనెల 26వ తేదీన తమిళనాడు కోయంబత్తూర్ లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించి కీటక శాస్త్ర మ్యూజియంను మరియు డ్రోన్స్ డిపార్ట్మెంట్ ను సందర్శించారు. 27వ తేదీన కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శించి వ్యవసాయ మ్యూజియం, అగ్రి ఇన్స్ట్రుమెంటేషన్ సెంటర్, సుగంధ ద్రవ్యాల నర్సరీని సందర్శించారు. 28వ తారీఖున ఎర్నాకులం జాతీయ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. 29వ తేదీన త్రివేంద్రంలోని వివిధ వ్యవసాయ ఆధారిత పరిశోధన సంస్థలను, అలాగే పరిశ్రమలను సందర్శించారు. ఈ దక్షిణ భారతవిద్యా పర్యటనలో 130 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి గైడ్గా డాక్టర్. అనురాధ, డాక్టర్. రేవతి, డాక్టర్. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రమేష్ పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ ఈ యాత్ర గురించి రోజువారి సమీక్ష చేస్తూ తగు సూచనలు చేస్తున్నారు. ఈ యాత్ర డిసెంబర్ రెండవ తేదీతో ముగుస్తుంది. ఈ యాత్రలో భాగంగా విద్యార్థులు వివిధ క్రొత్త వ్యవసాయ విషయాలను, వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పుల గురించి తెలుసుకుంటున్నారు. అలాగే నూతన వ్యవసాయ పరిశోధనలపై అవగాహన పెంచుకుంటున్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో పలువురు ఉద్యోగ విరమణ



లవాలంతరి లో ఉద్యోగ విరమణ పొందిన కరణం రాజు ముదిరాజ్ స్వామి ని సన్మానిస్తున్న నవజ్యోతి యూత్ క్లబ్ ప్రతినిధులు



రాజు స్వామి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు ఎం శ్రీనివాస్ యాదవ్, ఎం ఎ నయీమ్, తదితరులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం లో రంగు దేవయ్య ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్, డి శివాజీ లు

బుద్వేల్, నవంబరు 29 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరి) లో ఉద్యోగం చేస్తున్న కరణం రాజు ముదిరాజ్ స్వామి, వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఉద్యోగం చేస్తున్న ఆర్ దేవయ్యలు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వాలంతరి లో కరణం రాజు ముదిరాజ్ స్వామి ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ కు స్నేహితులు, బం దువులు, కుటుంబ సభ్యులు, రాజకీయ. ఉద్యోగ సంఘాల నాయకులు వచ్చి అయనకు శుభాకాం క్షలు తెలియజేశారు. కరణం రాజు ముదిరాజ్ శేష జీవితం ఆయూరారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుణ్ని ప్రార్ధించారు. రాజు ముదిరాజ్ స్వామి రాజేంద్రనగర్ పరిసర బస్తీల లో నివాసం ఉండే ప్రజలకు ఎంతగానో సేవ చేశారన్నారు. రాజు ముదిరాజ్ స్వామి ని సన్మానించిన వారిలో శాసనమండలి మాజీ ఛైర్మన్ కె స్వామీగౌడ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి జ్ఞానేశ్వర్, టీఎన్జీవోస్ నాయకులు శ్రీకాంత్, నార్సింగ్, గుడి మల్కాపూర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు వేణు గౌడ్, తలారి మల్లేశ్లతో పాటు రాజేంద్రనగర్ పరిసర బస్తీలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (టీచింగ్) లో పనిచేస్తున్న రంగు దేవయ్య శనివారం ఉద్యోగ విరమణ చెందారు. ఆయనను రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ తో పాటు జాయింట్ రిజిస్ట్రార్ డి.శివాజీ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రంగు దేవయ్య మాట్లాడుతూ, 31సంవత్సరాల పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సేవ చేసుకునే బాధ్యత లభించిదన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారాం కోసం డిసెంబరు 3న చలో హైదరాబాద్



చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీ యు డబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం డీ సలీమ్ భాష, రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, ఎం బాలసుబ్రమణ్యం తదితరులు

రాజేంద్రనగర్, నవంబరు 29 (ప్రభాత ఉదయం) : జర్నలిస్టుల సమస్యల సాధన కోసం డిసెంబరు 3వ తేదీన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయుడబ్ల్యుజే) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జర్నలిస్టులు అందరు విజయవంతం చేయాలని టీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం డీ సలీమ్ పాషా అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ టీయుడబ్ల్యుజే అధ్యక్షులు మేకల దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ లో చలో హైదరాబాద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అక్రిడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్తకార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్దరించాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలన్నారు. వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సంక్షోభంలో ఉన్న చిన్న. మద్య తరగతి పత్రికలను ఆదుకోవాలన్నారు. పోరాడి సాదించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్ర నిరాదరణకు గురౌతున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెసోలో జర్నలిసుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి నేడు మాటమార్చిందన్నారు. అందుకే డిసెంబరు 3న మాసాబ్యాంక్ వద్ద గల సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీయుడబ్ల్యుజే జర్నలిస్టులు నిరసన కార్యక్రమానికి తరలిరావాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీయుడబ్ల్యుజే రంగారెడ్డి జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, సీనియర్ పాత్రికేయులు ఎ పి చారి, ఎం.బాలసుబ్రమణ్యం, ఎం. ప్రేంరాజ్, బి. బాబురావు, వర్కాల చందు, గద్దె యాదగిరి, వినోద్, యు శ్రీకాంత్, కోరని మహేశ్, అనిల్, గోంగుర శ్రీనివాస్, రవీందర్, కె శ్యామ్, రామక్రిష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యంలో విద్యుత్ ఉత్పత్తే కీలకం

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. ఆ దిశగా విద్యుత్ తయారు చేసుకోవాలని ప్రణాళికలు చేస్తున్నామని, ఎనర్జీ వినియోగంలో భారత్ ఆరో స్థానంలో ఉందని గుర్తు చేశారు. 2014లో పవర్ డిమాండ్‌లో 6,755 మెగావాట్లు ఉండేదన్న ఆయన 2025లో 18,138 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. 2034 నాటికి 39,229 మెగావాట్లకు పెరుగుతుందని, 2025 నుంచి ప్రతి ఏటా 8.50 శాతం పెరుగుతుందని, 2047 నాటికి ప్రతి ఏటా 10 శాతం పవర్ గ్రోత్ అవసరం ఉంటుందని పేర్కొన్నారు.

హైదరాబాద్ గ్లోబల్ హబ్‌కు మారబోతోంది : విద్యుత్ ఉంటేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌కు మారబోతోందని, 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని అన్నారు. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలని సూచించారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి 24,760 మెగావాట్లని, విద్యుత్ స్టోరేజ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదని, అవసరాలకు తగ్గట్టుగా ఎనర్జీ స్టోరేజ్‌కు ప్రణాళిక లేదని వివరించారు.

విద్యుత్ ఉత్పత్తిపై భారం : విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్‌డ్ స్టోరేజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్‌డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉందని తెలిపారు. పంప్‌డ్ స్టోరేజ్‌కు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని, ఏపీలో ఒక్క ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రాష్ట్రానికి కావాల్సిన వాటర్, ఎనర్జీ పుష్కలంగా ఉన్నాయని, ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ముందుకెళ్తోందని తెలిపారు. యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ వద్ద ఎక్కడా బొగ్గు గనులు లేవని, వందల కిలోమీటర్ల నుంచి బొగ్గు తీసుకురావాల్సి వస్తోందని, విద్యుత్ ఉత్పత్తిపై భారం పడుతోందని అన్నారు. ప్రభుత్వం బొగ్గు గనుల వద్దనే థర్మల్ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని చూస్తుందని, ఎన్టీపీసీ, జెన్‌కో ఎవరు తక్కువ ధరకు నిర్మిస్తే వారికే ఇస్తామని, గత ప్రభుత్వం మాదిరిగానే కొనసాగుతుందని అనుకుంటున్నారని, అది తప్పని వివరించారు.



## పక్కాగా అభ్యర్థుల ప్రచార ఖర్చు నమోదు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం): గ్రామ పంచాయతీ ఎన్నికల పోటీ లో నిలిచే అభ్యర్థుల ఖర్చు లను నిర్ణిత ఫారం లో జాగ్రత్త గా నమోదు చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.అభ్యర్థుల ప్రచార ఖర్చు నమోదు చేసే అంశం పైన వ్యయ పరిశీలకులు జయశ్రీ, ఎక్స్పెండిచర్ మానటరింగ్ నోడల్ ఆఫీసర్ కోదండ రాములు, మండల వ్యయ పరిశీలకులు, అన్ని మండలాల ఎంపీడీఓ ల తో మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ శనివారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంత మేరకు ఖర్చు పెట్టాలానే అంశం మీద పూర్తి గా ఎంపీడీఓ లు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితిని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. ఫైనల్ గా పోటీ లో ఉండే అభ్యర్థులు కు ఇచ్చిన ఎన్నిక ల వ్యయముల ఖాతా నిర్వహణ రిజిస్టర్ లో పొందుపరిచిన ప్రొఫార్మా 1,2,3 లలో నమోదు అయిన ఖర్చు వివరాలని వ్యయ పరిశీలకులు పక్కాగా చెక్ చేయాలన్నారు.ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, ఎంసిఎంసీ టీం లు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, రేట్ చార్ట్ ప్రకారం మాత్రమే అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖర్చు లను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎంపీడీఓ లు, తహసీల్దార్ లు సమన్వయము చేసుకొని పోటీలో ఉండే అభ్యర్థులకు వివిధ రకాల అనుమతులను నిర్ణిత గడువు లోగ ఇవ్వాలన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న డిఈఓ

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**పింకీష్ కుమార్ అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి**

**ముగిసిన ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం**

**ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం): జిల్లా కేంద్రంలోని స్థానిక సాన్ మారియా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ముగింపు సమావేశం లో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పింకీష్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని వారి తరగతి గదులలో బోధిస్తున్నటువంటి విజ్ఞాన శాస్త్రాన్ని వంట పట్టించుకోని బయటి ప్రపంచాన్ని ఆ దృక్పథంతో గమనించి, వారు నేర్చుకున్న శాస్త్రీయ అంశాలను నిజ జీవితానికి అనవయించుకొని, వినూత్నంగా ఆలోచించి కొత్త కొత్త ఆవిష్కరణలకు బీజం వెయ్యాలని సూచించారు. ఈసారి విజేతలుగా నిలువని విద్యార్థులందరూ వచ్చే సంవత్సరం ఇదే కార్యక్రమానికి మరింత మెరుగుగా ప్రాజెక్టు తీసుకొని రావాలని, వచ్చేసారి విజేతలుగా నిలవాలి అని అన్నారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు పాల్గొన్న విద్యార్థులందరికీ ఆశీస్సులు అందించారు. అలాగే ఈ కార్యక్రమ నిర్వహణకు కృషిచేసిన కార్యాలయ సిబ్బందిని, ఆతిథ్యం ఇచ్చినందుకు సాన్ మారియా ఉన్నత పాఠశాల సిబ్బందిని యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం ముగింపు సమావేశం లో మొత్తం 40 మంది విజేతలకు సర్టిఫికెట్స్, శీల్డులు అందించారు. ఇందులో సైన్స్ ఫెయిర్ 7 సబ్ థీమ్స్ లో జూనియర్, సీనియర్ విభాగాల్లో మొదటి రెండో బహుమతి, ఇన్స్పైర్ లో 8 రాష్ట్ర స్థాయి ఎంపికలు, సెమినార్ విభాగం లో మొదటి, రెండవ టిఎల్ఎం తయారీలో మొదటి, రెండవ బహుమతులు, విద్యార్థులకు, గైడ్ టీచర్లులకు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందచేశారు.



## తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు

**రాష్ట్రాన్ని అగ్రగామిగా ఇచ్చి తీసిన కెసిఆర్ కె దక్కుతుంది**

కూకట్ పల్లి, నవంబర్ 29 (ప్రభాత ఉదయం) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలో అగ్రగామిగా ఘనత కేసిఆర్ కి దక్కుతుందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం దీక్షా దివాస్ సందర్భంగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రాణాలను అడ్డుపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా అన్ని రంగాల్లో కూడా గత పదిఏళ్లలో లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్రం స్ఫూర్తిగా మారిందన డంలో అతిశయోక్తిలేదని అన్నారు. నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా వంటి గొప్ప గొప్ప పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి





### జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం) గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు స్టేజి-2 రిటర్నింగ్ అధికారులు నిబద్ధతో పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ అన్నారు.శనివారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులకు( స్టేజి-2) ఎన్నికల ట్రినింగ్ నోడల్ అధికారి రమేష్ బాబు తో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో దశలో రిటర్నింగ్ అధికారి(స్టేజి %-××%) పాత్ర అత్యంత కీలకమని తెలిపారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని,ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వెబ్‌కాస్టింగ్,సౌకర్యాలు అన్నీ సిద్ధంగా ఉండాలనన్నారు. పోలింగ్ 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగియాలని,క్యూలో నిల్చున్న ఓటర్లకు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించాలన్నారు.పిఒలు ఫార్మ్ -25 (బ్యాలట్ పేపర్ అకౌంట్ ),పేపర్ సీల్ అకౌంట్, ప్రెసిడింగ్ అఫీసర్ డైరీ,పిఒ డిక్లరేషన్ వంటి చట్టపరమైన పత్రాలను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు.ఎన్నికల సమయంలో ఏ విధమైన అక్రమాలు, పోలింగ్ స్టేషన్ వద్ద ప్రచారం,లంచాలు ఇవ్వడం, బెదిరించడం వంటి చర్యలను తీవ్ర నేరంగా పరిగణించి, అలాంటి ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు,ఎంపిడిఓలకు తెలియజేయాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో,పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సలను సీల్ చేసి,కౌంటింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.మొదట పోస్టల్ బ్యాలెట్స్‌ను లెక్కించి,తర్వాత వార్డ్ మెంబర్ బ్యాలెట్ పేపర్లను వేరు చేసి లెక్కించాలన్నారు.అన్ని వార్డుల వార్డ్ మెంబర్ లెక్కలు పూర్తయ్యాక సర్పంచ్ బ్యాలెట్ పత్రాలను డ్రమ్‌లో కలిపి అభ్యర్థులవారీగా లెక్కించాలన్నారు.సమాన ఓట్లు వచ్చినప్పుడు డ్రా ఆఫ్ లాట్స్ తో విజేతను నిర్ణయించాలన్నారు. తర్వాత ఆర్.ఓ ఫార్మ్ %శశఎ××% లో ఫలిత ప్రకటన చేసి,ఫార్మ్ %శశఎ×××% రిటర్న్ ఆఫ్ ఎలక్షన్,అలాగే ఫార్మ్ %శశ×శ% సర్టిఫికెట్ ఆఫ్ ఎలక్షన్ విజేతలకు అందించాలన్నారు. అన్ని ఫలితాలను టి -పోల్ సాఫ్ట్‌వేర్‌లో కూడా అప్‌లోడ్ చేయాలన్నారు.ఉప-సర్పంచ్ ఎన్నికల విషయంలో,సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే ఉప-సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలని,కనీసం సగం సభ్యులు హాజరై ఉండాలని చెప్పారు.ఎన్నికల ఖర్చులు కూడా నియమాలకు అనుగుణంగా నిర్వహించాలని,అభ్యర్థులు తమ ఖర్చులను 45 రోజుల్లో ఎంపిడిఓకి సమర్పించాలన్నారు.ఖర్చుల పరిమితి గ్రామ పంచాయతీ జనాభా ఆధారంగా నిర్ణయించబడిందని వివరించారు. గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా సాగేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్,రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిల్ కు ఎంపికైన విద్యార్థి

## సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏకశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థి

జనగామ, నవంబర్ 29 (ప్రభాత ఉదయం): సైన్స్ ఫెయిర్‌లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి తమ ఏకశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు సెక్రటరీ సి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని సాన్ మరియా స్కూల్లో సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈ సందర్భంగా ఏకశిలా పబ్లిక్ స్కూల్ సెక్రటరీ సి.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ మా ఏకశిలా పబ్లిక్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.రిషిధర్ రెడ్డి బొగ్గు గని కార్మికుల క్షేమం కోసం జిల్లా స్థాయి ఇన్స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్ లో బొగ్గు గని కార్మికుల భద్రత కోసం పరికరం ప్రదర్శన చేశాడు. దీని ద్వారా జిల్లా స్థాయిలో బహుమతి పొంది జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకుని రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికైనట్లు ఉపేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థిని అభినందించారు.



కోల్ మైన్స్ సేఫ్టీ డివైస్ ను ప్రదర్శన చేస్తున్న రిషిధర్ రెడ్డి




## రైతులకు నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్

### విత్తన చట్టం అవగాహన కార్యక్రమం 2025

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం) రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు.ప్రొఫెసర్ జోగులాంబ గద్వాల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా కమిటీ అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రస్తుత వ్యవసాయ సాగు పరిస్థితులకు భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాద చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు, నర్సరీ మొక్కల యొక్క నాణ్యతను సరైన విధంగా నియంత్రించాలని ఉద్దేశంతో ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలని, నాణ్యతా లోపం, నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని విత్తనాలు దిగుమతిని కూడా సరళీకరించడానికి రైతు హక్కులను పూర్తిగా పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. విత్తన చట్టం అమలు చేయాలనే లక్ష్యంతో వాణిజ్య సరళీకరణ ఏవైనా ఉల్లంఘనలు జరిగినప్పుడు వాటి కారణమైన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకునే విధంగా నిబంధనలను పొందుపరచడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఈ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించడానికి ముందుగా వివిధ లబ్ధిదారులతో ప్రయోజన కారులతో చర్చలు చేపట్టి వారి ద్వారానే వచ్చే సలహాలు మరియు సూచనలను తీసుకొని ఈ బిల్లులో మార్పులు చేసి తర్వాత ఆమోదించడం జరుగుతుందని అన్నారు.కేవికె సైంటిస్ట్ సురేష్ మాట్లాడుతూ... ప్రతిపాదిత చట్టంలో మొత్తం పది అధ్యాయాలు, 48 విభాగాలు ఉన్నాయని అన్నారు. ఈ చట్టంలో కేవలం ప్రభుత్వం ద్వారా గుర్తించిన వివిధ రకాల విత్తనాలు మాత్రమే నియంత్రించ గలిగే అధికారం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, వ్యవసాయ అధికారులు, ఆల్ ఇండియా కృతి సంఘం అధ్యక్షులు గద్వాల్ తరఫున జీకే ఈరన్న, ఐజా గట్టు ఎఫ్ పి ఓ లు, విత్తన కంపెనీలు, డీలర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ పోరు.. రాత్రిపూట కొనసాగుతున్న నామినేషన్లు





గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా ధరూర్, కేటిదొడ్డి, గద్వాల, గట్టు మండలాలో సర్పంచి, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ రాత్రి 10గంటలు దాటినా కొనసాగింది. అభ్యర్థులు నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పిస్తున్నారు. పదుల సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రాత్రి 11/గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామపత్రాల దాఖలుకు అనుమతిస్తున్నారు. రాత్రి 11 దాటినా పూర్తి కాని నామినేషన్ ప్రక్రియ. ధరూర్ మండలం ధ్యాగదొడ్డి నామినేషన్ కొనసాగుతోంది.పోటా పోటీగా ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేశారు.ధ్యాగదొడ్డి గ్రామంలో మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. రసవత్తరంగా మారిన గ్రామ పంచాయతీ ఎన్నికలు నామినేషన్. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నికకు విశ్వ ప్రయత్నాలు . కేటిదొడ్డి, ధరూర్ మండలాలో బారులు తీరిన అభ్యర్థులు గ్రామ పంచాయతీ మొదటి విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శనిబారం నామినేషన్ సెంటర్ల వద్ద అభ్యర్థులు బారులు తీరారు. ఆయా మండలాలో రాత్రి 11 దాటినా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామపత్రాలు దాఖలు చేసేందుకు అభ్యర్థులు వరుసలో ఉన్నారు. సాయంత్రం 5గంటల లోపు వాచ్చిన వారికి అధికారులు టోకెన్లు జారీ చేశారు.



## టి.యు.సి.ఐ క్లాసులను జయప్రదం చేయండి

కొత్తకోట, నవంబర్ 29( ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి గుంపుగట్టు మిషన్ భగీరథ వర్కర్ల ఆధ్వర్యంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి నాయకత్వంలో కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ 30 న, గోపాల్ పేట మండలం కేంద్రంలో జరిగే టి.యు.సి.ఐ జిల్లా క్లాసులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల్ని అరిస్తున్న కేంద్ర ప్రభుత్వం కొత్త లేబర్ కోడ్స్ తీసుకొచ్చి పెట్టుబడిదారులకు దాసోహం అయింది అన్నారు. నరేంద్ర మోడీ కార్మిక వర్గాని పెట్టుబడుదారులకు విధానాలను తీసుకురావడం పట్ల తీవ్రంగా ఖండించాలని కోరారు. మిషన్ భగీరథ తో పాటు వివిధ రంగాల్లో పనిచేసే క్యాడర్, కార్మికులు క్లాసులకు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ జిల్లా నాయకులు విజయ్, నిరంజన్ ,వెంకటేష్, బాబు,శ్రీకాంత్ ,వెంకటయ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు చురుకుగా కృషి చేయాలి

### పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి

### ఎమ్మెల్యే సమక్షంలో

### కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం): స్థానిక ఎన్నికల సమీపిస్తున్న వేళ పాలకుర్తి మండల కేంద్రంలో దేవరుప్పుల మండలం, లక్ష్మణ్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు 15 మంది తమ పార్టీకి రాజీనామా చేసిశనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి సమక్షంలో నూతనంగా చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత తమను ఆకట్టుకుందని, అందుకే ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్టుగా తెలిపారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు చురుకుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేరువగా సేవలందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, మండల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిన్న భీమా రాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించిన డికె. స్నిగ్ధ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 29(ప్రభాత ఉదయం)ఇటీవల మృతి చెందిన నందిన్నె మాజీ సర్పంచ్ చిన్న భీమారాయుడు చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె స్నిగ్ధ రెడ్డి .. చిన్న బీమా రాయుడు మృతి హత్య అని పోలీసులకు తెలడం తో నింధితులను పోలీసులు అరెస్ట్ చేసారు..కొంత మంది నిందితులు బయట ఉన్నారని , మిగిలిన నిందితులను త్వరలో పట్టుకొని జిల్లాలో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని జిల్లా పోలీసులను కోరారు.. భీమా రాయుడు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,బిజెపి నాయకులు ఢిల్లీవాల కృష్ణ ,రాజు కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు..

